క్లుప్తంగా

పోలీసుల తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలో పోలీసులు శనివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన చౌక్‌ల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నెంబర్‌ప్లేట్‌లు సక్రమంగా లేని, ట్రిపుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జరిమానా విధించారు. వన్‌టౌన్ పరిధిలో నెంబర్ ప్లేట్స్ సరిగా లేని 45 బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రతీ వాహనానికి నెంబర్ ప్లేట్ కనిపించేలా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు అండగా 'సీఎంఆర్‌ఎఫ్'

కైలాస్‌నగర్: ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అండగా నిలుస్తోందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 14 మందికి మంజూరైన రూ.7లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, సాజిదోద్దీన్, అతిక్, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

తాంసి: పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని భీంపూర్ మండల పశువైద్యాధికారి సుభాష్ రాథోడ్ కోరారు. మండలంలోని అంతర్గాంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కపిల్, సిబ్బంది రాజు, గోవర్ధన్, రైతులు స్వామి, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నార్నూర్: భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ శేషరావు అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని మేడిగూడలో దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో పంట పొలాలు కొట్టుకపోవడంతో అనేక మంది రైతులు నష్టపోయారని, తక్షణమే సర్వే నిర్వహించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుద్దాల శ్రీనివాస్, సుద్దాల ఆనంద్, గ్రామ పటేల్ కొట్నాక తెలంగాణరావు, రైతులు జీతేందర్, గుల్వే ఉత్తమ్, కేర్బా పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

తలమడుగు: మండలంలోని బరంపూర్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బోథ్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, పాండురంగ్, రమాకాంత్, జావిద్, వెంకట్రావ్, దేవేందర్ రెడ్డి, సాబీర్, కాలీమ్, భీంరావ్, నిఖిల్ పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్‌లలో సౌకర్యాలు కల్పిస్తాం

ఇచ్చోడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతీ పోలింగ్‌బూత్‌లో సౌకర్యాలు కల్పిస్తామని తహసీల్దార్ తుకారాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ నూర్‌సింగ్ ఉన్నారు.

మంత్రిని కలిసిన జెడ్పీటీసీ

తాంసి: మంత్రి హరీశ్‌రావును తాంసి జెడ్పీటీసీ రాజు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ చాంబర్‌లో మాజీ ఎంపీ గోడం నగేశ్‌తో కలిసి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో వివేకానంద పాఠశాలలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేతికి ఫ్రెండ్‌షిప్ బాండ్లు కట్టుకున్నారు. ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డుకు ఇరువైపులా వృక్షాలు

పచ్చదనంతో కనువిందు

- సంకల్పించారు.. మొక్కలను సంరక్షించారు
- వృక్షాలుగా హరితహారం మొక్కలు
- చిట్టడవిని తలపిస్తున్న ఆర్టీసీ కార్యాలయ ప్రాంగణం

పరుచుకున్న పచ్చదనం..
వృక్షాలుగా ఎదిగిన టేకు, వేప, సీతాఫల్ మొక్కలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. దారికి ఇరువైపులా ఉండడంతో కార్యాలయానికి వచ్చి వెళ్లే వారికి రారామ్మని ఆహ్వానించేలా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అంతే కాదు అక్కడ ఏపుగా పెరిగిన వృక్షాల్లో అత్యధికం టేకు చెట్లే కావడంతో భవిష్యత్‌లో సంస్థకు వాటి ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చి పెట్టనున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.



ఏపుగా పెరిగిన సీతాఫల్ మొక్కలు

కైలాస్‌నగర్: ఆచరణలో చిత్తశుద్ధి ఉంటే ఏ కార్యక్రమమైన విజయవంతం అవుతుందనేందుకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణమే నిదర్శనంగా చెప్పవచ్చు. పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమాన్ని ఆర్టీసీ అధికారులు వందశాతం విజయవంతం చేశారు. నాటిన వందలాది మొక్కలు వృక్షాలుగా ఎదిగి ఆహ్లాదం పంచుతున్నాయి. పచ్చదనంతో కనువిందు చేయడంతో పాటు భవిష్యత్‌లో సంస్థకు అదనపు ఆదాయాన్ని తెచ్చిపెట్టనున్నాయి.

అధికారుల చిత్తశుద్ధితో పచ్చదనం..
ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలనే సీఎం కేసీఆర్ సూచనను ఆర్టీసీ అధికారులు ఆచరణలో పెట్టారు. హరితహారంలో భాగంగా ఆర్‌ఎం కార్యాలయ ఆవరణలోని ఖాళీ స్థలంలో టేకు, వేప మొక్కలు నాటారు. వీటితో పాటు సీతాఫల్ మొక్కలు నాటి, పెంచుతున్నారు. ప్రత్యేకంగా ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. ప్రతీరోజు నీటిని అందించేందుకు డ్రిప్ సౌకర్యం కల్పించారు. డీవీఎం, పీవోలుగా పనిచేసిన రమేశ్, విలాస్‌రెడ్డిలు మొక్కల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్‌హాల్‌లో రాయిసెంటర్ సార్‌మెడీల ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కనక తుకారం, ఆర్క ఖమ్ములు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఆరోజు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్‌కు పిలుపు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కుమ్ర మోహన్‌రావ్, తుంరం లక్ష్మణ్, కొడప శ్రీరాం, మెస్రం నాగ్‌నాథ్, తోడసం నాగోరావ్, సోయం రాందాస్, మడావి బాదు, మెస్రం జైరాం, ఉత్తం పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో..

ఇచ్చోడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు అత్రం మహేందర్, మెస్రందేవురావులు కోరారు. శనివారం మండల కేంద్రంలో కుమురం భీం భవన్‌లో మాట్లాడారు. ఈనెల 8న ప్రతీ గూడెంలో ఆదివాసీ జెండా ఎగురవేయాలన్నారు. మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. నాయకుల భీంరావు, కాత్లె విఠల్, మెస్రం చిత్రు, మెస్రం శంభు పాల్గొన్నారు.



ఇచ్చోడ: మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రతీ గ్రామంలో జెండా కార్యక్రమాన్ని నిర్వహించి, విజయవంతం చేయాలని గొండ్వాన గణతంత్ర పార్టీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొడప సొనేరావు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఆదివాసీల స్వయం పాలన ఆత్మగౌరవం, అస్తిత్వం, హక్కుల సాధన కోసం నిరంతరం తమ వంతుగా పోరాటం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తుమ్రం చందర్షావ్, రాయిసిడాం గంభీర్, గేడం విశ్వనాథ్, సిడాం నందు, ఆశన్న పాల్గొన్నారు.

ఏజెన్సీలో వైన్స్‌లు ఏర్పాటు చేయాలి

ఇచ్చోడ: రాష్ట్ర ప్రభుత్వం నాన్‌ఏజెన్సీలో కాకుండా ఏజెన్సీ ప్రాంతంలోనే వైన్స్‌లను ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాల నాయకులు శనివారం ఇచ్చోడ గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ లోకేశిరిష్‌రెడ్డిల ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఏజెన్సీలో ఉన్న వైన్స్‌లను ఎక్సైజ్ అధికారుల తప్పిదం వల్ల నాన్ ఏజెన్సీలోకి మార్చారని ఆరోపించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోనే వైన్స్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారీ భీమన్న, అత్రం మహేందర్, జాదవ్ రమేశ్, సిడాం మురళీకృష్ణ, ఉయికే బలిరాం, కొడప నగేశ్, పెరమండ్ల నారాయణ, మెస్రం దేవురావు పాల్గొన్నారు.



గ్రామసభలో తీర్మానం చేస్తున్న గిరిజనులు

తొలిమెట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్: విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు తిరిగి పెంపొందించేందుకు విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాపల్లి ఆశన్న కోరారు. శనివారం గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామంలోని రైతువేదిక భవన్‌లో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతులను సందర్శించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు పాఠశాలలో విజయవంతంగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు మెస్రం శేఖర్, మారోతి, మహేశ్, రంజిత్, మెస్రం లింగు, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఎంఈవో జయశీల అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హారూన్ భాను, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు



సిరికొండ: మండలంలోని సుండికి గ్రామ సమీపంలోని రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం ప్రజలు ఇచ్చోడ నుంచి సిరికొండకు ప్రయాణం సాగిస్తుంటారు. అయినా.. అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాగులు పంపిణీ

గుడిహత్నూర్: మండలంలోని గురుజ పంచాయతీ పరిధిలోని ఇస్రుగూడ గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తుల సుభాష్ వెల్ఫేర్ సొసైటీ సరఫరా చేసిన బ్యాగులను నిర్మల్ కాంగ్రెస్ ఎల్‌డీఎం అంకతి రవీందర్, సోంటక్కే బాలాజీ, ఉప సర్పంచ్ మెట్టు అవినాష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనిత జైరామ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వసీంఖాన్, చట్ల మహేందర్ పాల్గొన్నారు.

సరుకులు అందజేత

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కంది శ్రీనివాసరెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం సేవా దీక్ష చేపట్టారు. పట్టణంలోని ఖానాపూర్, కొలిపుర, చిల్కూరి లక్ష్మీనగర్, తాటిగూడ, భగత్‌సింగ్‌నగర్, ఖుర్షిద్ నగర్, కేఆర్‌కే కాలనీల్లో పర్యటించారు. రూ.17 లక్షల నిత్యావసర సరుకులను కేఎస్‌ఆర్ ఫౌండేషన్ ద్వారా పేదలకు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, షకీల్, కిజర్‌పాషా, మోసిన్ పటేల్, చంటి, కలీం పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

ఆదిలాబాద్‌రూరల్: నాటిన ప్రతీ మొక్కను విద్యార్థులు సంరక్షించాలని ఎంఈవో జయశీల అన్నారు. శనివారం మావల మంలంలోని శ్రీచైతన్య పాఠశాలలో నిర్వహించిన హరిత భారత్ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రకృతి పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్ గౌడ్, వైస్ ప్రిన్స్‌పాల్ అమరేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఈవీఎంల వినియోగంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కోరెంగా గాంధారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మండల రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ సెడ్మకి తిరుపతి, సోయం రాందాస్, పెందోర్ అంకుష్, సోన్‌కాంబ్లే బాబాసాహెబ్, కోరెంగా సుంకట్‌రావ్, బాలాజీ, అంగన్‌వాడీ టీచర్లు నందబాయి, నైనత, సుశీల, అనిత, సులోచన, సంగీత పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



కేసీఆర్, జోగు రామన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్, బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు మానుకోవాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. దివ్యాంగుల పెన్షన్ రూ.1000 పెంపు ఈనెల నుంచి అమలవుతుండడంతో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. బ్యాండ్‌మేళాలతో దివ్యాంగులు ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. గతంలో రూ.500 ఉన్న పెన్షన్‌ను బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.4116లకు పెంచి అమలు చేస్తుందన్నారు. దివ్యాంగులకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి అన్నివిధాలా అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, అధికార ప్రతినిధి గంగారెడ్డి, సాజిదోద్దీన్ పాల్గొన్నారు.

'బీజేపీకి ఏజెంట్‌లా వ్యవహరిస్తున్న గవర్నర్'



నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆదిలాబాద్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ బీజేపీకి ఏజెంట్‌లా వ్యవహరిస్తుందని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును రాష్ట్ర గవర్నర్ తిరస్కరించడంపై తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలతో కార్మికులు తెలిపిన నిరసనకు మద్దతు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో భాగంగా సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికుల కష్టాలను దూరం చేయడానికి ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయిస్తే గవర్నర్ పరోక్షంగా బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపించారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గవర్నర్ వ్యవహరించాలని, గతంలో సైతం అనేక బిల్లులను ఆమోదించకుండా ఇబ్బందులకు గురి చేశారని మండిపడ్డారు. ప్రజలు, కార్మికుల కడుపులు కొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే బిల్లును ఆమోదించి శాసనసభకు పంపించాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీఎంయూ నాయకులు రమేశ్, ఈవీఆర్ కిషన్, నారాయణ, దేవన్న, లింగన్న, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు పండ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అస్తిత్వ ఉద్యమానికి 'తుడుందెబ్బ' మద్దతు



దీక్ష చేపట్టిన తుడుందెబ్బ నాయకులు

బోథ్: గత 20 రోజుల నుంచి బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు కూర్చున్నారు. ముందు భగత్‌సింగ్ చౌక్ నుంచి బోథ్ పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేసి తుడుం మోగించారు. అస్తిత్వం కోసం చేస్తున్న రెవెన్యూ డివిజన్ సాధన సమితి పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రెవెన్యూ డివిజన్, డిగ్రీ కళాశాల, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయం ఏర్పాటు, ఫైర్ స్టేషన్ గురించి అసెంబ్లీలో మాట్లాడాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ డివిజన్ సాధన సమితి నేతలు, అఖిల పక్ష నేతలను సీఎం కేసీఆర్, కేటీఆర్ దగ్గరికి తీసుకెళ్లి చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు రాజన్న, పంద్రం శంకర్, దుర్వ విశ్వేశ్వర్, భోజన్న, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం ప్రారంభం



108 వాహనాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి

తాంసి: భీంపూర్ మండలానికి నూతనంగా కేటాయించిన 108 వాహనాన్ని శనివారం ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రం వద్ద మండల వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సిబ్బందితో కలిసి ప్రారంభించారు. మండల ప్రజలు అత్యవసర సమయంలో సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింబాజీ, ఈఎంటీ రాజు, పైలట్ దత్తు, తదితరులు పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ప్రాంగణంలో శనివారం 108 వాహనాన్ని సర్పంచ్ వట్టిపెల్లి ఇంద్రశేఖర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మెరుగైన వైద్య సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వం మండలానికి నూతన 108 వాహనాన్ని మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాక్రే గంభీర్, సతీష్ పవార్, గుండవార్ అకాష్, తేజ్‌రావు పాల్గొన్నారు.

10న కలెక్టరేట్ ఎదుట ధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాంసి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న జిల్లా తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు పెద్దఎత్తున రావాలని టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ కోరారు. శనివారం తాంసి మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ జాగరణ పేరుతో ఉద్యమం చేస్తున్నామన్నారు. పెండింగ్ బిల్లులతో పాటు పీఆర్‌సీ కమిటీ వేసి వెంటనే 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అమరేందర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.